ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5
శ్రీకాకుళం



17 వరకు 'పది' సప్లిమెంటరీ ఫీజు గడువు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహించనున్నారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు. జవాబు పత్రాల రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈనెల 13వ తేదీ నుంచి ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. జవాబుపత్రాల రీ వెరిఫికేషన్, జవాబుపత్రాల ఫొటోసాఫ్ట్ కాపీలు పొందాలనుకునే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది.

ఆంక్షలు దాటని 'కళ్యాణమస్తు'

- 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోకుంటే అనర్హత
- పదో తరగతి విద్యార్హతతో పేదలు దూరం
- పెండింగ్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిరుపేద కుటుంబాల్లో అమ్మాయిల వివాహం భారం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. పథకం పొందడానికి అర్హతకు ప్రస్తుతం అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న క్షణం నుంచి పథకం వస్తుందో? లేదో? అన్న ఆందోళన లబ్ధిదారుల్లో ఎదురవుతోంది. ఉద్దేశం మంచిదైనా ఆంక్షలు విధించడంతో, ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంటోంది. దీనివల్ల అర్హులైన పేదలు పథకాన్ని అందుకోలేకపోతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో అమలు చేసిన చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని రద్దు చేసి కొత్త మార్గదర్శకాలతో గతేడాది అక్టోబరు నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగులైన పేద యువతులకు వివాహమైన 30 రోజుల్లోపు పథకం కింద లబ్ధి పొందేందుకు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో వివాహ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

ఆలోపే కల్యాణమస్తు, షాదీతోఫా పథకానికి ఆ సమయంలోనే అక్కడే దరఖాస్తు చేసుకోవాలి. 31వ రోజు దరఖాస్తు చేసుకున్నా అనర్హులవుతారు. తొలివిడత లబ్ధి సమయంలో గడువు 60 రోజులు ఉండగా, దాన్ని రెండో విడత ఎంపికకు 30 రోజులకు కుదించారు. మూడు నెలలకోసారి (ఏటా నాలుగు సార్లు) వచ్చిన దరఖాస్తుల ద్వారా లబ్ధిదారులను గుర్తించనున్నారు. తద్వారా లబ్ధి మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా పథకం అమలు చేసినా తక్కువ మంది మాత్రమే లబ్ధి పొందారు.



సచివాలయాల్లోనే తిరస్కరణ

గతేడాది అక్టోబరు నుంచి డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో జనవరి నుంచి మార్చి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల ఐదో తేదీన నగదు విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రెండు విడతల్లో జిల్లాలో కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు చెందిన 540 దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇప్పటివరకు రెండు దపాలుగా 215 మందికి ఆర్థికసాయాన్ని అందజేశారు. రెండో విడత 125 మందికి జంటలకు రూ.80.10 లక్షల ఆర్థికసాయం మాత్రమే విడుదలైంది. మిగతా దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆ రెండు పథకాల కింద లబ్ధి పొందాలంటే వధూవరులిద్దరూ పదో తరగతి తప్పనిసరిగా చదివి ఉండాలి. పేరుకు పేదలైనా విద్యార్హత లేని కారణంగా వీరు అర్హులు కాదు. దీంతో సచివాలయ ఉద్యోగులే దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు.

నిబంధనలతో పథకానికి పేదలు దూరం

గత ఆరు నెలలుగా పెళ్లిళ్లు ఎక్కువగానే జరిగినా నిబంధనలు అడ్డు రావడంతో దరఖాస్తు చేసుకోలేకపోయారు. రానున్న రెండు నెలల్లో వందల సంఖ్యలో పెళ్లిళ్లు ఉన్నాయి. కళ్యాణమస్తు పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు అదే సామాజిక తరగతిలో వివాహం చేసుకుంటే రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బిసిలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకుంటే రూ.75 వేలు, ముస్లిం మైనార్టీలకు రూ.లక్ష , వికలాంగులకు రూ.1.50 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించనుంది. గత ప్రభుత్వ పథకంలో వధువు కుటుంబం మాత్రమే బియ్యం కార్డు కలిగి ఉంటే సరిపోయేది. వధూవరుల రెండు కుటుంబాలు తెల్లకార్డుదారులై ఉండాలి. లబ్ధిదారుల వడపోతకు మరోవైపు ఆరంచెల విధానం అమలు తరహాలోనే కళ్యాణమస్తు పథకానికి వర్తింపజేస్తున్నారు. విద్యుత్ బిల్లు నెలకు 300 యూనిట్లకు మించకూడదు. నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు.

పట్టణ ప్రాంతాల్లో నెలవారీ ఆదాయం రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు నిబంధన విధించారు. పొలం పదెకరాల్లోపు ఉండాలి. పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల మేర స్థలానికి మించి ఉండకూడదు. ఈ తరహా ఆరంచెల విధానాన్ని ఇప్పటికే ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలకు అమలు చేస్తుండగా, కళ్యాణమస్తు పథకానికి అవే నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో ఏదో ఒక సాంకేతిక కారణాలతో ఎక్కువ మంది పథకానికి దూరం అవుతున్నారు. నిబంధనలు సడలిస్తే మరింత మంది పేదలకు మేలు చేకూరుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

టిక్కెట్ డబ్బులు ఇవ్వలేదని...

బస్సు నుంచి తోసేశారు

- ప్రయివేటు బస్సు డ్రైవర్, క్లీనర్ అమానుషం
- అనుమానాస్పద మృతి మిస్టరీని ఛేధించిన పోలీసులు

ప్రజాశక్తి - లావేరు

టిక్కెట్ ఛార్జీ డబ్బులు ఇవ్వలేదని డ్రైవర్, క్లీనర్ ప్రయాణికుడిని బస్సులో నుంచి తోసేసి నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన మండలంలోని బుడుమూరు కూడలి సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల మూడో తేదీన చోటుచేసుకుంది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు మూడు రోజుల్లో మిస్టరీని ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జె.ఆర్ పురం సిఐ ఎస్.ఆదాం, ఎస్ఐ కోటేశ్వరరావు లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మీడియాకు వెల్లడించారు.

విశాఖపట్నం మధురవాడకు చెందిన గేదెల భరత్ కుమార్ (27) ఈనెల మూడో తేదీన తన స్నేహితులతో కలిసి కారులో ఈనెల 3న అర్ధరాత్రి శ్రీకాకుళం వచ్చారు. పని ఉండడంతో ఇంటికి వెళ్లాలని చెప్పడంతో స్నేహితులు వెంకటేశ్వరరావు, శివ ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ కూడలి వద్ద వేకువజామున భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రయివేటు బస్సు (గంగోత్రి)కు ఎక్కించారు. కొంత దూరం వచ్చేసరికి బస్సు డ్రైవర్, రామకృష్ణ, క్లీనర్ బొమ్మాళి అప్పన్న టిక్కెట్ ఛార్జీ రూ.200 ఇవ్వాలని అడగ్గా, స్నేహితులు ఫోన్ పే చేస్తారని ఇచ్చేస్తానని భరత్ కుమార్ చెప్పాడు. ఎప్పటికీ డబ్బులు చెల్లించకపోవడంతో మరికొంత దూరం వెళ్లాక మళ్లీ టిక్కెట్ డబ్బులు అడిగారు. స్నేహితుల ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని, విశాఖ వెళ్లాక ఇస్తానని చెప్పాడు. దీంతో మార్గమధ్యంలో బస్సు దిగిపోవాలని డ్రైవర్ చెప్పడంతో వారి మధ్య గొడవ మొదలైంది. బుడుమూరు సమీపంలోకి వచ్చేసరికి మాటకు మాట పెరగడంతో డ్రైవర్, క్లీనర్ భరత్‌ను నెట్టేసి వెళ్లిపోయారు. రోడ్డుపై డివైడర్ భరత్ తలకు తగిలి బలమైన గాయమైంది. పొట్ట కింద భాగం రెండుగా చీలిపోయింది. ఒక కాలు విరిగిపోయింది. కొన ఊపిరితో ఉన్న భరత్‌ను హైవే పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా లావేరు ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎస్.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నవభారత్ కూడలి వద్ద 3.45 గంటలకు బస్సు ఎక్కుతున్నట్లు సిసి టివి ఫుటేజ్ ఉండడంతో, మూడు రోజుల పాటు హైవేపై ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్, క్లీనర్‌ను విచారించగా, బస్సు నుంచి తోసేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ ఆదాం, ఎస్ఐ కోటేశ్వరరావు



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

9న ప్రాంతీయ సదస్సు

- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం మొండివైఖరి
- సమస్యల పరిష్కారం వరకూ పోరాటం
- ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 9వ తేదీన తొలి ప్రాంతీయ సదస్సును శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో ప్రాంతీయ సదస్సు ఈనెల 17న అనంతపురంలో, మూడో సదస్సు 27న ఏలూరులో, నాలుగో సదస్సు జూన్ ఎనిమిదో తేదీన గుంటూరులో నిర్వహించనున్నట్లు వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రాంతీయ సదస్సులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా మొండివైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు నాలుగేళ్లుగా రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించడం లేదని, అయినా ఉద్యోగులంతా ప్రభుత్వానికి సహకరిస్తూ విధులను సమర్థతతో నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతేడాది ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమంతో ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలిచి కొన్ని హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. వాటినీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి అసోసియేట్ ఛైర్మన్ ఫణి పేర్రాజు, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజేష్‌బాబు, జిల్లా ఛైర్మన్ కె.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య, క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఎపి డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాష్యూ ఎక్స్‌పో


ప్రజాశక్తి - పలాస

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మైదానంలో పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ (పిసిఎంఎ) ఆధ్వర్యాన నిర్వహించిన కాష్యూ ఎక్స్‌పో ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. పలు రాష్ట్రాలకు చెందిన 28 కంపెనీలు ఇందులో పాల్గొని అధునాతన యంత్రాలను ప్రదర్శించాయి. వ్యాపారులు, ఔత్సాహికులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. జీడిపిక్కలను బాయిలింగ్ చేసే యంత్రాలు, వాటికి సరిపడా ప్రెజర్‌ను అందించే పులింగ్ మిషన్లు, గాలి ఒత్తిడిని అందించే మిషన్లు, బాయిలింగ్ అయిన జీడిపిక్కల కటింగ్ మిషన్లు, తొక్కను, పిక్కను వేరు చేసే యంత్రాలను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. జీడిపప్పుపై ఉన్న తొక్కను తీసే యంత్రాలు, పప్పును సైజును బట్టి వేరు చేసే యంత్రాలు, రంగును బట్టి పప్పును వేరు చేసే యంత్రాలు... పప్పు, బద్ద, గుండ ఇలా సైజుల బట్టి వేరు చేసే యంత్రాలు, పప్పు పాడవకుండా ఆక్సిజన్ విడుదల చేసే ప్యాకెట్లు తదితర యంత్రాలను ప్రదర్శనలో ఉంచారు. మాన్యువల్, ఆటోమేటిక్, విద్యుత్, విద్యుతేతర పరికరాలను ప్రదర్శించారు.



ఎక్స్‌పోలో ప్రదర్శించిన యంత్రాలు





జీడి పరిశ్రమల అభివృద్ధికి కృషి

జీడి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పలాస పిసిఎంఎ అధ్యక్షులు మల్లా సురేష్ కుమార్ అన్నారు. జీడి ఎక్స్‌పోలో ప్రదర్శించిన యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి వ్యాపారులు యంత్రాలు కొనుగోలు చేసేందుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీడి పరిశ్రమల సంఘం కార్యదర్శి కె.వి శివకృష్ణ, పి.రవికాంత్, మల్లా భాస్కరరావు, మల్లా రామేశ్వరరావు, జీడి వ్యాపారులు, జీడి పరిశ్రమల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన 'పీరుకట్ల'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస

మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్, ఆయన సోదరుడు ప్రభాకరరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నివాసంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో చంద్రబాబు వారికి పార్టీ కండువా కప్పారు. జిల్లాలో టిడిపికి పూర్వవైభవాన్ని తీసుకురావడానికి పాటుపడాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.



టిడిపి అక్రమాలపై సిట్ దర్యాప్తు కోరుతాం

ప్రజాశక్తి - నరసన్నపేట

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. సిట్ ఏర్పాటుపై సుప్రీంకోర్టు తీర్పుని వెంటనే ఆచరణలో పెట్టి దర్యాప్తును ప్రారంభించాలని కోరారు. అమరావతి రాజధాని పేరుతో పెద్దఎత్తున జరిగిన భూ కుంభకోణమే కాకుండా టిడిపి హయాంలో శ్రీకాకుళం జిల్లాలో రూ.వందల కోట్ల కుంభకోణాలు ఉన్నాయని తెలిపారు. బినామీ పేర్లతో తిత్లీ తుపాను పరిహారం పక్కదారి పట్టించడం, వంశధార యూత్ ప్యాకేజీ అవకతవకలపై దర్యాప్తు చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు. అన్ని ఆధారాలను దర్యాప్తు బృందానికి అందజేస్తామని తెలిపారు. ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు పాత్ర ఇప్పటికే స్పష్టమైందని తెలిపారు. తప్పులు చేసి స్టేలు తెచ్చుకుంటూ రోజులు నెట్టుకొచ్చారని, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వారికి ఒక చెంపపెట్టు అని పేర్కొన్నారు.

మణిపూర్‌లో విద్యార్థుల వివరాలు అందించాలి



శ్రీకాకుళం : మణిపూర్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న జిల్లాకు చెందిన విద్యార్థుల వివరాలను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల వివరాలను ప్రభుత్వానికి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న కొందరు తెలుగు విద్యార్థుల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్న దృష్ట్యా జిల్లాకు చెందిన విద్యార్థుల కుటుంబసభ్యులు వివరాలు అందజేయాలని కోరారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నంబరు, కుటుంబ పూర్తి చిరునామా, విద్యను అభ్యసిస్తున్న నగరం తదితర వివరాలను సమర్పించాలని తెలిపారు. ఈ విషయాన్ని తహశీల్దార్లు గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి వివరాలను సమర్పించాలని సూచించారు.

రవీంద్రనాథ్ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తి విశ్వజనీయమైందని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి విశ్వకవి అందించిన గీతాంజలి కావ్యం ఎంతో గొప్పదన్నారు. భారత జాతీయ గీతం జనగణమన రచనలో దేశ ఔన్నత్యాన్ని ఠాగూర్ అద్భుతంగా కీర్తించారన్నారు. గీతాంజలి కావ్యం ద్వారా నోబెల్ బహుమతిని పొందిన భారతీయునిగా దేశ ఖ్యాతిని రవీంద్రుడు విశ్వవ్యాప్తం చేశారని చెప్పారు. గాంధీ మందిరంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం ప్రతి ఒక్క విద్యార్థి సందర్శించేలా దేశభక్తిని పెంపొందించుకునేలా తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిరం నిర్వాహకులు బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, కొంక్యాన వేణుగోపాల్, మహీబుల్లా ఖాన్, పందిరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- ఆరోగ్య శ్రీకాకుళం లక్ష్యం
- మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ జి.వెంకటరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు శ్రీకాకుళం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ జి.వెంకటరావు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేయడమే కాకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త పోగు పడకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరంతరాయంగా సాగుతున్న పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ మంచి ఫలితాలను సాధిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య శ్రీకాకుళం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

నగర పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

నగరపాలక సంస్థ పరిధిని విస్తరించిన తర్వాత మరింత బాధ్యత పెరిగింది. విలీన పంచాయతీలను కలుపుకొని 50 వార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 317 మంది కాంటాక్టు కార్మికులు, 70 మంది రెగ్యులర్ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

వీరితో పాటు విలీన పంచాయతీల్లో మరో 109 మంది కార్మికులను నియమించి పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కార్మికులను పర్యవేక్షించే శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల సీనియర్ మేస్త్రీలకు బాధ్యతలు అప్పగించి పనులు చేయిస్తున్నాం. వార్డు సచివాలయాల్లో శానిటరీ సెక్రటరీలు ఉండడం వల్ల పర్యవేక్షణ మరింత సులభతరమైంది. కాల్వల్లో పూడికతీత, చెత్త తొలగింపుతో పాటు ఇంటింటికీ చెత్త సేకరణ సజావుగా నిర్వహించడం వల్ల పారిశుధ్య నిర్వహణ మెరుగుపడింది.





సీజనల్ వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం. మలేరియా, డెంగీ తదితర జ్వరాలకు దోమలే కారణం. దోమల నివారణలో భాగంగా లార్వా ఉత్పత్తి కాకుండా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. టాయిలెట్ గొట్టాలకు మెస్‌లు అమర్చుతున్నాం. గతేడాది 18 వేల మెస్‌లు కట్టించాం. ఈ ఏడాది పెద్దఎత్తున కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఫాగింగ్ చేపట్టేందుకు ఐదు చిన్న, ఒక పెద్ద మెషీన్ అందుబాటులో ఉంది. నీటి నిల్వ ప్రాంతాలను హెల్త్ సెక్రటరీ గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్ ద్వారా సంబంధిత వార్డు సెక్రటరీకి సమాచారం చేరుతుంది. వార్డు సెక్రటరీ 24 గంటల వ్యవధిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి నీటి నిల్వను తొలగించే పనులు చేపట్టి, ఆ ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రోడ్లపై పశువుల సంచరించకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

శ్రీకాకుళం నగరంలో కొందరు పశువుల పెంపకందారులు రోడ్ల పైకి పశువులను విడిచిపెడుతున్నారు. వాటి వల్ల ట్రాఫిక్‌కూ ఇబ్బందులు కలుగుతున్నాయి. పశువులను రోడ్లపైకి విడిచిపెట్టే యజమానులకు పలుమార్లు చెప్పాం. మార్పు రాని వారికి అపరాధ రుసుము విధిస్తున్నాం.


అభినందిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

చదువులో మరింత రాణించాలి

డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- మెళియాపుట్టి

చదువులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని డిఇఒ తిరుమల చైతన్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 590 మార్కులతో రెండో స్థానం సాధించిన సారవకోట కెజిబివిలో చదువుతున్న ఉర్లన జాహ్నవి విద్యార్థిని స్వగ్రామమైన సానిపాలెంలోని బాలిక నివాసానికి ఆదివారం వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు. అలాగే ఆమె తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు సన్మానించారు. కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ డిఇఒ గార పగడాలమ్మ, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, హిరమండలం ఎంఇఒ రాంబాబు, స్థానిక సర్పంచ్ మజ్జి రాము, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న నర్సింహులు

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ శాంతికి వివిధ దేశాల మధ్య మైత్రీని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అప్పుడే శాంతి, సౌభ్రాతృత్వాలను కాపాడుకోగలమని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు అన్నారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఇస్కఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ వ్యవస్థాపకులు రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, అలాగే అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ చైతన్యం కోసం సభ్యులు పాటుపడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర ఉద్యమ చరిత్రను నేటి తరానికి తెలియజేయాలన్నారు. సంపదతో పాటు ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, ఈ అసమానతలు తొలగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ఇస్కఫ్ ఆధ్వర్యాన ప్రజల్లో అవగాహన కల్పించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.నాగాభూషణరావు, వర్కింగ్ అధ్యక్షుడు ఎ.రాజు, పొగుడు రాజు, కరకవలస శ్రీను, కిరణ్‌శర్మ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల చెరుకు సాగుపై ఆసక్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సేంద్రీయ ఎరువులతో సాగులో వినూత్న పద్ధతులు చేపట్టి వ్యవసాయ యాంత్రికంతో సాగును రైతులు చేపడుతున్నారు. అధిక దిగుబడులు సాధించే మార్గాలు ఎంచుకొని యాంత్రికరణ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ ఎరువులతో చెరుకు రైతులు పంటను సాగు చేస్తున్నారు. మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతంలోని నిమ్మతొర్లాడ, చెప్పెనపేట, జి.కె.వలస, కొరపాం, బుడితిపేట తదితర పది గ్రామాల్లో చెరుకును పండిస్తున్నారు. దీంతో బెల్లం తయారు చేసి చెక్కిల రూపంలో మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేపడుతున్నారు. దీపావళి నుంచి పండగ వరకు గ్రామాల్లోని ప్రజలు వివిధ రకాల పిండి వంటల్లో బెల్లానికి ఎక్కువగా వినియోగిస్తుంటారు. అందుకే ఈ సీజన్లో మార్కెట్లో బెల్లానికి ఎక్కువ డిమాండ్ ఉండటంతో అక్టోబరు నెల నుంచి జనవరి చివరి వరకు గానుగలను మొదలుపెట్టి బెల్లం తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో చెరుకు సాగుకు భూములు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరికి బదులుగా చెరుకును సాగుచేస్తున్నారు.

మంచి సారవంతమైన భూములు కావడంతో సేంద్రీయ పద్ధతిలో రసాయనాలు లేని బెల్లాన్ని ఈ ప్రాంత రైతులు తయారు చేస్తుంటారు. ఎకరా పొలంలో పండే చెరుకు పంటను బెల్లంగా మార్చేందుకు 15 నుంచి 20 రోజులు పడుతుంది. పంట పొలాల్లోని చెరకును గానుగలు వద్దకు తీసుకువచ్చి నునుపుగా చేసి గానుగ యంత్రం ద్వారా రసం తీసి ఈ రసాన్ని ఇనుప పెనంలో వేసి ముదురుపాకం వచ్చే వరకు దాన్ని కలిపి పక్కనే ఉన్న ఇనుప ట్రేల్లో బెల్లం పాకం వేసి చెక్కిలను, దిమ్మల రూపంలో తయారు చేస్తారు. గతంలో మట్టి కుండల్లో బెల్లం వేసి ఒకటి, రెండు కేజీల బెల్లం కుండలను తయారు చేసి విక్రయించేవారు. రాను రానూ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో చెక్కిలను తయారు చేసి చిన్న చెక్కిలు 6 నుంచి 8 కేజీల రూపంలో,


యంత్రంతో కలుపు తీస్తున్న రైతు

పెద్ద చెక్కిలు 14 నుంచి 18 కిలోల వరకు తయారు చేస్తుంటారు. ఈ బెల్లం చెక్కిలను కవర్లో పెట్టి మార్కెట్లో విక్రయిస్తారు. ఇక్కడ తయారయ్యే బెల్లం మంచి నాణ్యత కలిగి ఉండటంతో ఇతర జిల్లాలకూ ఎగుమతి అవుతుంది. చెరుకు పంట సాగుకాలం 9 నెలల నుంచి 11 నెలలు పడుతుంది. చెరకు విత్తును ఫిబ్రవరి మార్చి నెలలో నాటుతారు.

40 నుంచి 50 టన్నుల దిగుబడి

ఎకరాకు 40 నుంచి 50 టన్నుల దిగుబడి వస్తుంది. బెల్లం దిగుబడి మొక్క చెరకకు ఐదు టన్నులు మమ్ము చెరుకు రెండు నుంచి మూడు టన్నులు దిగుబడి వస్తుందని అభ్యుదయ రైతు ముద్దాడ కృష్ణ తెలిపారు. బెల్లం తయారు చేసే రైతులను రైతు భరోసా కేంద్రాల ద్వారా గుర్తించి సబ్సిడీ రుణాలను అందించాలని కోరారు. పంచదార కంటే బెల్లంలో పోషకాలు విలువ ఎక్కువ అని, ఈ మధ్యకాలంలో బూర్జ మండలం పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ద్రవ పొడి బెల్లాలను తయారు చేసి మార్కెటింగ్ కూడా తామే చూసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. దళారీ వ్యవస్థ లేకుండా అమ్మకాలు కొనసాగించడంతో రైతులకు గిట్టుబాటు అవుతుంది. రసాయన ఎరువులతో అధిక ఖర్చు తక్కువ దిగుబడి వస్తుంది. శాస్త్రవేత్తల సలహాలు సూచనలతో సేంద్రీయ ఎరువుల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రసాయన ఎరువులతో పండిన పంటల కంటే సేంద్రీయ ఎరువులతో పండిన పంటలపై ప్రజలకు మక్కువ ఉండటంతో ఆ పంటల ఉత్పత్తులను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. సేంద్రీయ ఎరువుల ద్వారా ఎకరా చెరుకు పంటకు రూ.70 వేలు ఖర్చు అవుతుందని, అధిక దిగుబడిలను సాధించగలుగుతున్నామని, దీంతో బెల్లాన్ని తయారు చేసి విక్రయిస్తే రూ.1.5 లక్షలు ఆదాయం వస్తుందని రైతులు తెలుపుతున్నారు. అదే రసాయన ఎరువుల ద్వారా ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతుందని, దిగుబడి వచ్చేసరికి రూ.1.5 లక్షలు ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

నిమ్మతొర్లాడ రైతులతో టిటిడి ఒప్పందం

మండలంలోని నిమ్మతొర్లాడ బెల్లాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డు ప్రసాదంలో వినియోగించేందుకు అక్కడ రైతులతో ఒప్పందం చేసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆ గ్రామానికి చెందిన 18 మంది రైతులతో ఒప్పందం చేసుకున్నారు. ఇక్కడి రైతులు ప్రకృతి సాగు విధానంలో చెరకు పంటను సాగు చేయడంతో ఇక్కడ తయారయ్యే బెల్లాన్ని శ్రీవారి లడ్డు ప్రసాదంలో వినియోగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఏడాదికి 105 టన్నుల బెల్లం అందించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇక్కడి రైతులను గ్రోవర్ గ్రూపుగా ఏర్పాటు చేసి రైతు సాధికారిక సంస్థ ద్వారా బెల్లాన్ని అందించడానికి ముందుకొచ్చారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

డిసిసి అధ్యక్షులు సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


సత్యవతి

మాజీ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ నెల 5న మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్, 108 వంటి పథకాలను తీసుకొచ్చి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అక్కులపేట, శ్రీనివాసచార్యులపేట గ్రామాల్లో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్, రింగ్ రోడ్లు, సిసి రోడ్లు, పిహెచ్‌సి, హైస్కూల్, వెటర్నరీ ఆస్పత్రి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. దానిని సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిగా ఆపాదిస్తే ఎలా అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయంలో భాగంగా రైతు భరోసా కేంద్రం, సచివాలయం పరిపాలనలో భాగంగా నిర్మించారని, అంతేకానీ ప్రత్యేకించి చేసినది ఏమీ లేదని విమర్శించారు. ప్రజలు ఈ విషయాన్ని ఇప్పటికైనా గుర్తెరగాలని కోరారు.

ఘనంగా మరిడమ్మ అమ్మవారి పండగ

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు విభాగం ఆధ్వర్యాన ఏటా వైశాఖ మాసంలో మరిడమ్మ అమ్మవారి పండగలను మైదానం నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు స్వాగతం పలకగ, మంగళ వాయిద్యంతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సెబీ జెడి వి.ఎన్.మణికంఠ, అదనపు ఎస్‌పి టి.వి.విఠలేశ్వరరావు, డిఎస్‌పి డి.ప్రసాదరావు, ఆర్‌ఐలు ప్రేదీప్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న ఎస్‌పి రాధిక

క్రైమ్ కార్నర్

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు


సూర్యారావు (ఫైల్)

అరసవల్లి ఆలయానికి ఆదివారం దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలి సూర్యారావు (35) మృతి చెందాడు. మండలంలోని బుడుమూరు కూడలి సమీపంలో ఆటోలో నుంచి జారి తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో జిల్లా సర్వజనాస్పత్రికి తరలిస్తుండ మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయపాలవలసకు చెందిన బాలి సూర్యారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో అరసవల్లి దర్శనానికి వేకువ జామున వెళ్లారు. సూర్యనారాయణస్వామిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలోని బుడుమూరు వద్ద ఆటోలో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ఉత్తర, ఇద్దరు పిల్లలు రేష్మ, సంజు, తల్లిదండ్రులు సూర్యనారాయణ, లక్ష్మిలు ఉన్నారు. సూర్యారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ బి.వి.కె.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెద్దదిక్కును కోల్పోయాం

సూర్యనారాయణ, లక్ష్మి దంపతులకు ఒక్క కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సూర్యారావు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సూర్యారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబమంతా రోడ్డునపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని నరసపురం, దిమిలాడ గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్లి కోటేశ్వరరావు (50) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతబొమ్మాళి మండలం బోరగాంకు చెందిన కోటేశ్వరరావు తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం తాపీ పని కోసం టెక్కలి వెళ్లాడు. పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. రోడ్డు పక్కన ఉన్న రాయిపైకి బైక్ ఎక్కించడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. మృతుడికి చిన్నమ్మడు, కుమార్తె కళ్యాణి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- జలుమూరు


వెంకటరమణ (ఫైల్)

మండలంలోని గొటివాడ పంచాయతీ అక్కివలసకు చెందిన కొల్లేటి వెంకట రమణ (42) శనివారం పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కుమార్తె దుర్గకు అప్పు చేసి వివాహం చేశాడు. పెళ్లి తరువాత వెంకటరమణ రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఇలా రోజూ మద్యం తాగితే అప్పులు ఎలా తీరుతాయని ఇంటి వద్ద మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గ్రామానికి శివారున ఉన్న ధర్మసాగరం వద్ద పురుగులు తాగి పడిపోయాడు. గ్రామస్తులు గుర్తించి వెంటనే జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య రత్నాలు, కొడుకు సింహాచలం ఉన్నారు. భార్య రత్నాలు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్‌ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక స్థితిగతులు మార్చే ఆయుధం విద్య


సన్మానిస్తున్న ఎంఇఒ తులసీరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సామాజిక స్థితిగతులు మార్చే గొప్ప ఆయుధం విద్య అని ఎంఇఒ డి.తులసీరావు అన్నారు. మండలంలోని ఒంకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డొక్కరి జనార్ధన్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించారని అన్నారు. ఇష్టపడి, ఆసక్తితో చదివిన చదువు ఉన్నత స్థితికి తీసుకెళుందని అన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో 590 మార్కులతో తృతీయ స్థానం సంపాదించిన పాఠశాల విద్యార్థిని కొండప్ప ఇందును, ఆమె తల్లదండ్రులు ధనరాజు భానుమతిలను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గుంటి రీటా, వైస్ చైర్మన్ బాలకృష్ణ, సర్పంచ్ జోగి అప్పారావు ఎంపిటిసి సురేఖ, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

'తెప్పల'కు సత్కారం

పలాస : డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి స్వర్ణ నంది పురస్కారం పొందిన సందర్భంగా శ్రీకాకుళం బాపూజీ కళా మందిర్‌లో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చిట్టి వెంకటరావు, కార్యదర్శి బంటు రామచంద్రదేవ్, పౌరాణిక నటులు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, విశ్రాంత ఆర్‌జెడి పాత్రుని పాపారావు, రామలింగస్వామి, నరసింహమూర్తి, హరి సత్యనారాయణ, వెంకటరావు, రమణారావు, జ్యోతి పాల్గొన్నారు.


మెమెంటోను అందజేస్తున్న సభ్యులు

నీటిఎద్దడి నివారణకు చర్యలు


నీటిని పరిశీలిస్తున్న సంజీవరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణారావుతో కలిసి స్థానిక మార్కెట్ యార్డు వద్ద తాగునీటి బోరు మరమ్మతుల పనులను ఆదివారం పరిశీలించారు. అలాగే మెయిన్‌రోడ్డులో ఇండియన్ బ్యాంకు వద్ద తరచూ లీకవుతున్న పైపులైను పనులను మరమ్మతులు చేపట్టారు. మేజరు పంచాయతీ పరిధిలో చాలా ఏళ్ల కిందట వేసిన తాగునీటి పైపులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, దీంతోన నీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని గుర్తించి పాడైన స్థానంలో కొత్త పైపులు వేసి నీటి సమస్య లేకుండా శాశ్విత పరిష్కారం చేపడుతున్నామని తెలిపారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాడాలి

పలాస : ఆదివాసులపై అప్రకటిత యుద్ధం ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపల్లిలో అల్లూరి సీతారామరాజు 99వ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులను బేస్ చేసుకుని కొమరం భీమ్, బీరశా ముండా, అల్లూరి సీతారామరాజు, దొరబంధాలు చంద్రయ్య వంటి నాయకత్వాన సాయుధ గెరిల్లా పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. అడవిపై హక్కు కోసం, ఆదివాసీల జీవించే హక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని చెప్పారు. అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సార జగన్, వంకల పాపయ్య, రైతు కూలీ సంఘం నాయకులు జగన్, జడ్డే, అప్పయ్య గంగయ్య, జ్యోతి కృష్ణారావు, ప్రగతిశీల మహిళా సంఘం పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ, వంకల సాగర్ పాల్గొన్నారు.


కంచిలి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న భీమారావు

కంచిలి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జాతికి చేసిన సేవలు ఆదర్శనీయమని, వాటిని కొనసాగేలా చూద్దామని మద్దిల భీమారావు పిలుపునిచ్చారు. మండలంలోని బూరగాంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కప్ప గోపీనాథ్, సర్వేశ్వరరావు, బోట్ట శ్రీరాములు, కొక్కిరి రాజు, లింగరాజు, మన్మథరావు, అప్పారావు, గాంధీ, జయరాం, సాంబమూర్తి పాల్గొన్నారు.

అరసవల్లి కిటకిట


అన్నదానంలో వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైశాఖ మాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ పెరగడంతో కిటకిటలాడింది. వేలాదిగా యాత్రికుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. క్యూలైన్లలో పెద్ద ఎత్తున బారులు తీరారు. దీంతో ఆలయానికి ఒక్క రోజున రూ.14.40 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.10,36,400, విరాళాల రూపంలో రూ.53,748లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,50,000 ఆదాయం సమకూరినట్లు ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశామని అన్నారు.

రూ.లక్ష విరాళం

సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు ద్వారపు అనురాధ తన తల్లిదండ్రులు బొత్స వెంకటరావు, జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అజిత్, అనురాధ దంపతులు ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒ వి.హరిసూర్య ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలను కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మండవల్లి రవి, నెమలపురి కోటేశ్వరరావు, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.పద్మావతి పాల్గొన్నారు.

యాత్రికులకు అన్నదానం

సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు చేయూత మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించి యాత్రికులకు వడ్డించారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి సేదతీరేందుకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వైశ్యరాజు వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షులు కోరాడ హరగోపాల్, సభ్యులు సంగీత, కోట్ని లింగరాజు, శైలజ, గుడ్ల మల్లేశ్వరరావు, కామేశ్వరి, బాలామణి, న్యూబ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ, అన్నపూర్ణ, మణిశర్మ, మోహన కృష్ణ, అరుణ, మంజుల పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : మహనీయులను స్మరించుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నగరంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే అంధవరపు తవిటయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా తవిటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాదరణ ఉన్న నాయకుడు తవిటయ్య అని, అందుకే పార్టీలకతీతంగా జిల్లా ప్రజలు అతనిని శాసనసభ్యునిగా గెలిపించారని అన్నారు. సూరిబాబు మాట్లాడుతూ తమకు రాజకీయ భిక్ష పెట్టిన తమ పెద్దనాన్నను స్మరించుకోవడం కర్తవ్యంగా భావిస్తున్నానన్నారు. అనంతరం మన్యం జిల్లాకు చెందిన విజయగౌరికు ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించనందుకు తవిటయ్య స్మారక అవార్డు కింద రూ.15 వేలు నగదు అందజేశారు. అనంతరం వరం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కిల్లంశెట్టి ధనలక్ష్మికి కళింగ వైశ్య సేవా సంఘం ఆధ్వర్యాన రూ.21 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టిడిపి నాయకులు జామి భీమశంకరరావు, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్కు శ్రీను, పట్టణ అధ్యక్షులు పూన్న నాగరాజు, మన్యం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, చల్లా శ్రీనివాసరావు, సుడా చైర్‌పర్సన్ ఆశాలత, బరాటం సంతోష్‌కుమార్, శిల్లా చందు, గుడ్ల నాగేశ్వరరావు, గుడ్ల దాము, ఎం.సుధాకర్ మోనంగి కేశవ్, నీలాపు ముకుంద పాల్గొన్నారు.


గౌరికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

68 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 68 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి సత్యంనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన మండు వేసవిని సైతం లెక్కచేయకుండా ఇంత మంది రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంకుకు అందచేశారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇ.వి.సత్యనారాయణ, తిరుపతిరాజు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీ నాయుడు, జె.ఆర్.పురం కార్యదర్శి లింగాల ఆదినారాయణ, ఇజ్జు శ్రీనివాసరావు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, మింద్రాన రామారావు, తాజ్ మొయిద్దీన్, దన్నాన రమణ, పసుపురెడ్డి సురేష్, గెడ్డపు వరం, చోడిశెట్టి చంద్రశేఖర్, కూనిబిల్లి సత్యారావు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

లావేరు : లావేరు మండలం మురపాక శాఖాగ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థీ వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు కోరారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో వేసవి విజ్ఞాన శిబిరాలకు వస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ శిబిరాలకు తల్లిదండ్రులు వారి పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, జి గడ్డియ్య పాల్గొన్నారు.


లావేరు : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రణస్థలం: రణస్థలం శాఖాగ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థీ వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి కోరారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించి విద్యార్థులతో వేసవి విజ్ఞాన శిబిరాలకు వస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడశాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిలక బృందాదేవి రవికుమార్ రెడ్డి కోరారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ నెల 8 నుంచి 16 వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని బి.రూపావతి, సహాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి 11 వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు చిత్రలేఖనం, కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్ ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నేర్పుతామని తెలిపారు.


నౌపడ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బృందాదేవి



బ్యాటింగ్ చేస్తున్న రాంబాబు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడలో సేపేన ప్రకాశరావు మెమోరియల్ టోర్నమెంట్‌ను వైసిపి మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, జనసేన పార్టీ మండల కన్వీనర్ కొత్తకోట నాగేంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. మానసికోల్లాసానికి సమస్యలు పరిష్కారమ వుతాయని అన్నారు. తొలిరోజు కొత్తకోట-తోటవాడ గ్రామాల జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. ఫైనల్ విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు సాయి కుమార్, రాజేష్, స్వరూప్ తెలిపారు.

'మే' పుష్పం కనువిందు



పట్టణంలోని పూజారిపేటలో నివాసం ఉంటున్న బొడ్డేపల్లి కనక లక్ష్మి ఇంటి ఆవరణలో మే పుష్పాలు వికసించాయి. మే పుష్పాలపై ఆమెను వివరణ కోరగా, మే నెలలో మాత్రమే ఈ అరుదైన పుష్పాలు పుష్పిస్తాయని తెలిపారు. పట్టణంలోని వాళ్ల ప్రాంతాల ప్రజలు ఈ పుష్పాలను తిలకించేందుకు ఇక్కడకు విచ్చేసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - ప్రజాశక్తి, ఆమదాలవలస

పలువురికి ఆర్థికసాయం



రణస్థలం : ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి– కవిటి

మండలంలోని సీమూరుకు చెందిన శివంగి గురుమూర్తి ఇటీవల కొబ్బరి చెట్టుపై కాయలు తీస్తూ జారిపడి మృతి చెందారు. దీంతో గురుమూర్తి భార్య లక్ష్మి, కుమారుడు గణేష్, కుమార్తె సింధు దిక్కులేనివారయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం, యూత్ ఫోర్స్ గ్రూప్ రాష్ట్ర సభ్యులు ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి పిల్లల చదువు కోసం గ్రామస్తులు రూ.50 వేలు, యూత్ ఫోర్స్ గ్రూప్ సభ్యులు, జిల్లా గ్రూప్ సభ్యులు కలిపి రూ.20 వేలు వారికి అందజేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు, గ్రూపు అధ్యక్షుడు ఈరోతు వెంకటస్వామి, కవిటి మండల అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణరావు, కార్యదర్శి పాతిన వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కీలు చంద్రశేఖర్, గ్రామ నాయుడు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం

రణస్థలం: లావేరు మండలం గుమ్మడాం పంచాయతీ నాగంపాలెం ఎస్‌సి కాలనీ యువత ఏర్పాటు చేయనున్న బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రూ.20 వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని యువకులు కోరారు. వారి కోరిక మేరకు ఈ ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో లావేరు మండలం ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు జగ్గురోతు తవిటి నాయుడు, నాయకులు జగ్గురోతు జగదీష్ పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

కోటబొమ్మాళి: మండలంలోని పొడుగుపాడుకు బబ్బురు ఎర్రయ్య నోటి కేన్సర్‌తో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు వల్ల వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ (కొత్తపేట) సభ్యులు ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే మండలంలోని పెద్దలు, గ్రామ పెద్దలు, యువకులు తమ వంతు సహాయంగా ముందుకు వచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కంబాల అప్పలరాజు, చిన్నారావు, కుటికుప్పల ముకుందరావు, రామకృష్ణ, సిమ్మన్న, రాజు, సంతోష్, ఢిల్లీ పాల్గొన్నారు.

ట్రస్టు సభ్యులు..

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన నెల్లూరు శోభ కుటుంబానికి గృహ అవసరాల నిమిత్తం రాంబాబు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.21 వేలు నగదు ఆర్థికసాయం కింద అందజేశామని ట్రస్టు నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహక సభ్యులు గుణాకర్, పెదరట్టి మణి పాల్గొన్నారు.



కవిటి : నగదును అందిస్తున్న శ్రీరాములు, లక్ష్మణరావు



రాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఖరీఫ్ ప్రణాళికపై అవగాహనా ర్యాలీ

ఆమదాలవలస : మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రకృతి సాగు ఖరీఫ్ ప్రణాళికపై వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌కు గ్రామాల్లో మరింత ఎక్కువ విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా ప్రణాళికలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. రైతుల చేత నవధాన్య పద్ధతులను సాగు చేసేలా, ఖరీఫ్ సీజన్‌కు సీడ్ టూ సీడ్ అనగా విత్తనం వేసిన నుంచి మళ్లీ పంట తీసేంతవరకు పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతులు సాగు చేసేలా చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేష్, తిరుపతి, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు పనుల కారణంగా పొడవాటి స్తంభాలు మార్చడం, విద్యుత్ తీగలు అమరుస్తామన అన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, లంకాం, రైస్ మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలి పారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

పలాస: సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీ శంకర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. స్థానిక ఆస్పత్రి వద్ద నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈయనతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు ఉన్నారు.



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న భవాని శంకర్

వాకపల్లి గిరిజన మహిళలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న దానేష్

పలాస : వాకపల్లి గిరిజన మహిళలపై జరిగిన అత్యాచార ఘటనలో దోషులను శిక్షించి, బాధిత మహిళలకు న్యాయం చేసే వరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయని ఉత్తరాంధ్ర మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి పోతనపల్లి నాగమణి అన్నారు. మండలంలోని బొడ్డపాడు అమర వీరుల సంస్మరణ మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాల ద్వారానే చట్టాలను అమలు చేయించుకుని న్యాయం పొందే వరకు మహిళల పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఇంటా, బయటా స్త్రీలు అనునిత్యం, అనుక్షణం పోరాటం అనివార్య పరిస్థితికి పాలక ప్రభుత్వాలు నెట్టాయని దుయ్యబట్టారు. మహిళలకు అనేక చట్టాలున్నా, అమలు కోసం పోరాడితే తప్ప న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాకపల్లి ఘటనలో కేసు ఫిర్యాదు మొదలు, తీర్పు వరకు బాధిత మహిళల పోరాటం అనిర్వచనీయమని శ్లాఘించారు. విశ్రాంతి న్యాయమూర్తుల కమిటీ ద్వారా దోషులను గుర్తించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పోతనపల్లి సుమ అరుణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు పత్తిరి దానేష్, కె.నీలకంఠం, లక్ష్మణ్, వీరాస్వామి, భీమారావు పాల్గొన్నారు.

టిడిపి పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి– మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గంలో టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెలే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని జాడుపల్లిలో పార్టీ కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని అన్నారు. ప్రతి గ్రామంలోనూ రాష్ట్రాని ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, వసంత్, పైడిరాజు, కోదండ, పరమేశు, వల్లభ, సిలార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్మవారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం : పట్టణంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారు ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే బెందాలం అశోక్ పాల్గొన్నారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. తిరువీధిలో ఉండగా ఎమ్మెల్యే అశోక్ అమ్మవారును దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వివిధ కళా రూపాలను తిలకించారు. ఉత్సవల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

నిధులు విడుదలపై హర్షం

నందిగాం : మండలంలోని పెంటపూరు బిసి కాలనీ నుంచి కొత్తచెరువు వరకు విద్యుత్ విస్తరణకు పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు రూ.లక్ష నిధులు విడుదల చేశారు. నిధులు మంజూరు చేయడంపై స్థానిక నాయకులు బి.గిరిబాబు, పి.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, జె.నారాయణరావులు హర్షం వ్యక్తం చేశారు.